## కథ

సిహెచ్.సాయిప్రియ

**"ఏవండీ..వస్తున్నారా?" కోడికూసే ఝామునే లేచి పక్కింటి పాపాయమ్మగారి కోడితో సమానంగా కూత పెడుతోంది శ్రీమతి.**

**"ఆ..ఆ..ఇదిగో వస్తున్నా" అన్నాను నేను వంటింట్లోంచి.**

# జ్ఞానోదయం


తను జాగింగులు, స్కిప్పింగ్‌లు మొదలెట్టిన దగ్గర్నుండి, ఉదయాన్నే ట్యూషన్లకి, ఆ తర్వాత స్కూళ్ళకి వెళ్ళాల్సిన పిల్లలకి, నా ఉపచారాలకి పనిపిల్లే పెద్దదిక్కయింది. అయినా మూడ్నెలలు కాచివడబోసిన నా అనుభవంతో కాఫీ కాచుకొని, ఆ కెఫిన్ ద్రావకాన్ని గళాసులో నింపుకొని బయటకొచ్చాను. ఈలోగా మా బావమరిది కూడా వచ్చి మాతో జాయినయ్యాడు.

ఇంతకుముందు నాతో ఒక అరగంట మా మేడ మీద వాకింగ్‌కి రమ్మంటే, మాటిమాటికి మీ అందింపులకు రన్నింగులు, ఏ పనిని వేలేసి ముట్టుకోని పిల్లలతో జాగింగులు చేస్తూనే ఉన్నాను కదా, ఇంకా వేరే వాకింగులు ఎందుకండి. అదీకాక రోజులో పది మైళ్ళు ఇంట్లో తిరుగుతూనే ఉన్నాను గదండి అనేది, తను.

కాని, ఆ మధ్య నా మరదలొచ్చి, నా శ్రీమతికి ఆరు వేలు పోసి కొన్న కంచి పట్టుచీరపై కన్నేసి, ''అక్కా, బావకి ముసలిరూపు వచ్చేసినా, నువ్వు మాత్రం సంతూర్ మమ్మిలాను, నాకు చెల్లెల్లాను ఉన్నావే. ఇదెలా సాధ్యమయింది. ఏమిటా రహస్యం చెప్పు. చెప్పు'' అంది టీ.వీ.యాంకరు పిల్లలా కళ్ళు మిటకరిస్తూ.

ఆ మాటకి పిల్స్‌బర్రీ రొట్టెలా పొంగిపోయి, ప్రైడ్ ఆఫ్ ఇండియాలా నావైపు చిన్న లుక్కిచ్చి కనుబొమ్మలు ఎగరేసింది శ్రీమతి. అసలు రహస్యమంతా తనకి కొన్న పట్టుచీరలో ఉందని గ్రహించలేకపోయింది. ఏమైతేనేం పట్టుచీర తను మడిచేసి, ఈ బాడీగార్డు ఉద్యోగం నాకు అంటగట్టి వెళ్ళింది నా మరదలు.

అది మొదలు నా శ్రీమతి తన అందాన్ని మరింత ద్విగుణీకృతం చేసుకొనేందుకు పడని పాట్లు లేవు. మా ఇంట్లో పేయింగ్ గెస్టుగా వున్న హారికతో కలిసి జాగింగులు స్కిప్పింగ్‌లు చేయడం మొదలెట్టింది.



హారిక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. సీత కష్టాలు సీతవి, పీత కష్టాలు పీతవి అన్నట్లు, ఆమె మసాలాబోండాలా కాస్త బొద్దుగా ఉండటంతో వచ్చిన సంబంధాలన్నీ వచ్చినట్లే వెనక్కి వెళ్ళేవి. అయితే ఆమె మంచి ఉద్యోగస్తురాలని, అందగత్తెని, తనకి తగిన జోడీ అని మా బావమరిది భావించటంతో మా వాడికి ఆ సంబంధం ఖాయం చేసుకున్నాం.

మా బావమరిది అత్యాశాపరుడు. జపాన్ నుండి దిగుమతి కాబడ్డ సుమోలా ఉండే అతగాడికి ఏ సినీమాయరోగం పట్టుకుందోగాని, ''నువ్వు ఊర్మిళా మతోండ్కర్‌లా తయారైతే చూడాలని ఉందోయ్'' అన్నాట్ట కాబోయే భార్య హారికతో.

అంతే ఊర్మిళలా సన్నగా తయారవడానికని ఆమె జాగింగులు, స్కిప్పింగ్‌లు చేయటం మొదలెట్టింది. ఆమెకి నా శ్రీమతి కూడా తోడైంది గదా. ఎన్ని చేసినా, ఎంతచేసినా, మనకి ఒలింపిక్ ఫలితాల్లాంటి ఫలితమే దక్కటంతో, ఆ కాబోయే భర్తగారు డైటింగ్ చేయమని హుకుం జారీ చేసారట.

పాపం, ముద్దుగా బొద్దుగా ఉండే ఆ పిల్ల డైటింగ్‌తో సన్నగా చీపురుపుల్లలా తయారైంది. ఆ కొలతల్నీ అలాగే కొనసాగించమన్నాట్ట అతగాడు. ఇక తప్పేదేముంది. జాగింగ్‌లు, స్కిప్పింగ్‌లు,

డైటింగ్‌లు తప్పనిసరి అయ్యాయి ఆమెకు.


ఒక శుభోదయాన జాగింగ్ చేసొచ్చి, స్కిప్పింగ్ చేస్తున్న తరుణంలో, ఆమె వరల్డ్ ట్రేడ్‌సెంటర్‌లా కుప్పకూలిపోయింది. నలుగురం మోసుకెళ్ళి ఆమెను హాస్పిటల్‌లో చేర్పించాం. డైటింగులవల్ల ఆమె గుండె బలహీనమైపోయిందట. ఆ చీపురుపుల్ల కాయంలో బొమికలు తప్ప రక్తం మాంసం అన్నవి లేవట. మరే రోగం లేదట. కాబట్టి ముప్పొద్దులా మూడు కుంభాలు లాగిస్తూ మూడ్నెల్లు బెడ్ దిగకుండా ఉంటే ఓటరు లిస్టులో ఆమె పేరుంటుందని, లేదంటే ఏదో రోజున ఆ గుప్పెడు గుండె చడీ చప్పుడు లేకుండా చటుక్కున ఆగిపోతుందని, డాక్టరు గారు చెప్పి ఇంటికి పొమ్మన్నారు. ఆమె పేరెంట్స్‌ని పిలిపించి ఆమెను తమ స్వగ్రామం పంపించేశాం.

''ఊ..బయల్దేరుదామా?'' అంది శ్రీమతి.

''తమ ఆన..'' అన్నాను గతంలోంచి బయటకొచ్చి చెప్పుల్లో కాళ్ళు దూర్చుతూ.

''అక్కా ట్యూషన్లకి వెళ్ళొస్తాం'' అంటూ సైకిళ్ళెక్కి వెళ్ళిపోయారు పిల్లలు మా ముందు నించే పనిపిల్లలకి టా. టా..బైబై చెప్తూ..

శ్రీమతి మనసు బాధపడకపోలేదు. ఆ బాధంతా ఆమె ముఖంలో ప్రస్ఫుటంగా గోచరిస్తోంది.




ఇంటికి ఎదురుగా ఆటో వచ్చి ఆగడంతో నా మరదలు వచ్చినట్టనిపించింది నాకు. శ్రీమతి వైపు చూసాను. 'పదహారేళ్ల వయసు' సినిమాలో శ్రీదేవిలా కన్పడటంతో నా గుండె ఝల్లుమంది. నేను ముచ్చటపడి కొని తెచ్చుకున్న వస్తువులకి కాళ్ళొచ్చి, టక టక నడిచొచ్చి ఆటో ఎక్కుతున్నట్టు అనిపించటంతో మెదడు మొద్దుబారిపోయింది. నేనెవరు? నాదనేది ఏది? నేను నాది అన్నది వట్టి భ్రమే కదా. అంతా మిధ్య. ఎటో వెళ్ళిపోయింది నా మనసు.

''ఆ..లాగు. ఆ..నువ్వు తొయ్యి..'' లాంటి అరుపులు నన్ను ఈ లోకంలోకి నెట్టుకొచ్చాయి.

వచ్చింది నా మరదలేమోనన్న భయం 'సరస్'లా నింగికెగరగానే, నా బుర్ర మళ్ళీ పన్జేయడం ప్రారంభించింది.

''ఏదో పిప్పళ్ళబస్తా దించుతున్నట్టుంది. ఎవరి దబ్బా?'' అన్నాను శ్రీమతితో, కళ్ళను చిల్చుకుంటూ చూస్తూ.

''వెళ్ళి ఓ చెయ్యి వేయరాదటండీ. పాపం..'' అంది శ్రీమతి.

అందుకు నేనే తగినవాడినంటూ మా బావమరిది ఆటో దగ్గరకు వెళ్ళాడు. ఆటో గిజ గిజ గింజుకుంటూండగా అందులోంచి అతికష్టం మీద భారీశాల్తీ బయటపడింది. రజతం మోసుకొచ్చిన మన ఒలింపిక్ వీరుల్లా వారంతా వరుసగా నిలబడ్డారు.

''ఇద్దరూ ప్రక్క ప్రక్కన నిలబడితే, మేడ్‌ఫర్ ఈచ్ అదర్‌లా ఉన్నారు'' అన్నారు మా బావమరిది మావగారు.

''అరె. మన హారిక'' అన్నాను అప్పుడు గుర్తుపట్టి శ్రీమతితో.

''ఈ జాగింగ్‌లు, స్కిప్పింగ్‌లు, డైటింగ్‌లు మనకొద్దండి. మన ఇంటి పని మనమే చేసుకుంటే అంతకుమించిన వ్యాయామం ఇంకొకటి ఉండదు.

అదీకాక ఇంటిని పనివాళ్ళకి అప్పచెప్పడం వల్ల జీవితంలో మధురమైన అనుభూతుల్ని కోల్పోతున్నాం కూడా'' అంది పరిపూర్ణ జ్ఞానాన్ని పొందిన శ్రీమతి వాళ్ళని ఇంట్లోకి తీసుకెళ్తూ.

''ఆశ ఎన్ని లాభాలను సమకూరుస్తుందో, అది శృతిమించితే అన్ని అనర్ధాలకు దారితీస్తుంది'' అన్నాడు బాధగా బావమరిది అక్క వెంటపడి.

'తనకంటూ ఒక వ్యక్తిత్వం లేకపోతే, ఎవరి బ్రతుకైనా ఇలాగే తగలడుతుంది' గొణుక్కుంది హారిక కాబోయే భర్తని అనుసరిస్తూ.

నా బుర్రకి అవేం పట్టటం లేదు... నా ఇంటి వస్తువులకి కాళ్ళు రాలేదన్న వాస్తవం నన్ను మహదానందంలో ముంచెత్తుతుంటే.

## కొత్త ఇమేజ్

ఎప్పుడూ వార్తల్లో తారగా ఉండే ప్రియాంకా చోప్రా ఇప్పుడు తను నటించే సినిమాల యాడ్స్ విషయంలో వార్తల్లోకి వచ్చింది. అక్షయ్‌కుమార్‌తో ఆమెకున్న వ్యవహారాన్ని పక్కనపెడితే ప్రియాంకా తను నటించిన సినిమా గురించి ఎంతో వివరంగా పాత్రికేయులకి చెబుతోంది. ఐత్‌రాజ్ సినిమా తర్వాత అబ్బాస్ మస్తాన్ కొత్త చిత్రం వీర్‌జార, మొగల్-ఎ-అజమ్ తనకి కొత్త ఇమేజ్‌ని తెచ్చిపెట్టగలదని ఆమె భావిస్తోంది. 'కుటుంబ సంబంధాల నేపథ్యంగా సాగే ఈ చిత్రాలు అందర్నీ మెప్పిస్తాయి' అంటోంది చోప్రా.

